
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 30 ఏప్రిల్ 2025

నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా: ఆర్డీవో

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను నిబంధనలకు అనుగుణంగా కచ్చితత్వంతో తయారు చేయాలని శ్రీకాకుళం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో బూత్‌స్థాయి అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మరణించిన, రెండుసార్లు నమోదైన, వివాహం జరిగిన వారి ఓట్లు తొలగించాలన్నారు. మొబైల్ అనువర్తనం, ఈఆర్‌వో నెట్ వంటి వ్యవస్థల వినియోగంపై అవగాహన సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్స్ నిల్.. సేవలు డల్





- జిల్లాలో ఏపీ ఫైబర్ నెట్ అస్తవ్యస్తం
- తరచూ సిగ్నల్, సాంకేతిక సమస్యలు
- నెలలో సగం రోజులే..
- ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వీర్యం
- ఈ ప్రభుత్వం గాడిన పెట్టేనా?

● ఎచ్చెర్ల గ్రామానికి చెందిన ఓ ఉద్యోగి ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ తీసుకున్నాడు. అటు టీవీలో అన్నిరకాల ఛానళ్లు, ఇంట్లో పిల్లలు వినియోగించుకునేందుకు నెట్ సదుపాయంతో పాటు అన్ లిమిటెడ్ ఫోన్ సౌకర్యం ఉంటుందని భావించి కనెక్షన్ పొందాడు. కానీ నెలలో సగం రోజులు సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. నెట్‌వర్క్ సైతం చాలా నెమ్మదిగా ఉంటోంది. ఒక్కోసారి ప్రసారాలు ఆగిపోతున్నాయి. నెట్ కూడా రోజులో చాలాసార్లు ఇబ్బంది పెడుతోంది. దీంతో ప్రైవేటు సంస్థ ఫైబర్ నెట్‌కు మారేందుకు యోచిస్తున్నాడు.

● జేఆర్‌పురం మండల కేంద్రానికి చెందిన ఎస్.విజయ్‌కుమార్ సాధారణ ప్రైవేటు ఉద్యోగి. ఇంట్లో పిల్లల చదువులకు సంబంధించి ఇంటర్నెట్ అవసరం. అదే సమయంలో ఇంట్లో నాలుగు సెల్‌ఫోన్లు వాడుతున్నారు. ఈ క్రమంలో ఫైబర్ నెట్ కనెక్షన్ తీసుకుంటే తక్కువ ప్యాకేజీకే మొత్తం అందుతాయని భావించి కనెక్షన్ తీసుకున్నారు. కానీ సిగ్నల్ ఉండడం లేదు. తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పాత పద్ధతిలోనే డిష్ టీవీ పెట్టుకున్నారు. ఆ పై పిల్లలు ప్రైవేటు నెట్‌వర్క్ నుంచి ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు.

రణస్థలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఫైబర్ నెట్ సేవలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రభుత్వం ఇంటింటికీ నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నట్టు చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ ఫైబర్ నిర్వీర్యం అయింది. కూటమి ప్రభుత్వం గాడిన పెట్టే ప్రయత్నం చేస్తోంది. జిల్లాలో మాత్రం మెరుగుపడడం లేదు. జిల్లాలో గృహాలకు సంబంధించి 20 వేల ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి. సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి మరో 2 వేల వరకూ సర్వీసులు ఉన్నాయి. అయితే వాటికి కూడా నిరంతరాయంగా సేవలు అందించడంలో ఏపీ ఫైబర్ నెట్ పూర్తిగా విఫలమవుతోంది. దీంతో వినియోగదారులు విసిగిపోయి ప్రైవేటు నెట్‌వర్కులను ఆశ్రయించాల్సి వస్తోంది. దాదాపు అన్ని పట్టణాలు, మునిసిపాలిటీల్లో ఏపీ ఫైబర్ నెట్ సేవలు తగ్గుముఖం పడుతున్నాయి. జియో, ఎయిర్‌టెల్ వంటి ప్రైవేట్ సంస్థల కనెక్షన్లు పెరుగుతున్నాయి.



ఎచ్చెర్లలో ఓ వినియోగదారుడి ఇంట్లో ఇదీ పరిస్థితి

2017లో ఏర్పాటు..

ఇంటర్నెట్, కేబుల్, ల్యాండ్ ఫోన్..ఇలా మూడు రకాల సేవలను అతి తక్కువ ధరకు ప్రజలకు అందించడమే ధ్యేయంగా 2017లో టీడీపీ ప్రభుత్వం ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్‌ను ప్రారంభించింది. వాస్తవానికి ఈ మూడు సేవలను విడివిడిగా సర్వీస్ ప్రొవైడర్లు అందించేవారు. అందుకే ఈ మూడు రకాల సేవలను ఫైబర్ నెట్ ద్వారా అందించడం ద్వారా కుటుంబాలకు స్వాంతన చేకూర్చవచ్చని అప్పటి సీఎం చంద్రబాబు భావించారు. విద్యుత్ శాఖతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,449 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ స్తంభాలను ఉపయోగించుకొని 24 కిలోమీటర్ల మేర కేబుల్ లైన్‌ను ఏర్పాటు చేశారు. రూ.149కే బేసిక్ ప్లాన్ అందుబాటులోకి తేవడంతో అనతికాలంలో ఏపీ ఫైబర్ నెట్ సేవలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. అయితే ఏపీ ఫైబర్ నెట్‌తో తమ కేబుల్ వ్యవస్థ ఎక్కడ దెబ్బతింటుందోనని ఆపరేటర్లు ఆందోళన చెందారు. ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ల పట్ల విముఖత చూపారు. అందుకే పట్టణాలు, సమీప గ్రామాలకే ఏపీ ఫైబర్ నెట్ పరిమితం అయ్యింది. ఆపై 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ బేసిక్ ప్లాన్‌ను రూ. 149 నుంచి ఏకంగా రూ.350కు పెంచింది. పైగా ఫైబర్ నెట్ నిర్వహణను గాలికి వదిలేయడంతో సేవలకు అంతరాయం కలిగింది. ఆపై వినియోగదారుల సంఖ్య తగ్గింది. జిల్లాలో 2020 నాటికి 50 వేల వరకూ కనెక్షన్లు ఉండగా.. 2024 నాటికి వచ్చేసరికి 20 వేలకు పడిపోయాయి.

గణనీయంగా తగ్గిన కనెక్షన్లు..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 4.95 లక్షలకు తగ్గుముఖం పట్టినట్టు సదరు సంస్థ అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి ఏపీ ఫైబర్ నెట్ టారిఫ్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయి. రూ.349కు సంబంధించి ప్రైవేటు సంస్థలతో పోల్చుకుంటే తక్కువే. 100 ఎంబీపీఎస్ నెట్ స్పీడు ఉంటేనే సేవలు సాధ్యమయ్యేది. కానీ ఏపీ ఫైబర్ నెట్‌కు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. నెట్ వర్క్ సక్రమంగా ఉండడం లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విస్తరించే పనులేవీ చేయలేదు. కేవలం టీడీపీ ప్రభుత్వం, చంద్రబాబు ప్రవేశపెట్టారన్న కోపంతోనే నిర్లక్ష్యంగా విడిచిపెట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గాడిన పెట్టే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఒక వైపు నెట్ వర్క్ పెంచడం, సాంకేతిక సమస్యలు (మిగతా 6వ పేజీలో..)

అడ్మిషన్లకు తిరగలేక.. డీఎస్సీకి చదవలేక



- ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సతమతం
- పిల్లలను స్కూళ్లు, కళాశాలల్లో చేర్పించాలని యాజమాన్యాల ఒత్తిడి
- డీఎస్సీ ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టలేకపోతున్న వైనం
- ఉద్యోగం వదిలేద్దామంటే తరువాత పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా ఉద్యోగార్థులు ఆశగా ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో అభ్యర్థులు డీఎస్సీ సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తోన్నారు. కొందరు కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటుంటుంటే, మరికొందరు ఇంటి వద్దనే ఉండి చదువుతున్నారు. అయితే, డీఈడీ, బీఈడీ పూర్తి చేసి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో టీచర్లు, అధ్యాపకులుగా పని చేస్తున్న కొందరు అభ్యర్థులు మాత్రం అడ్మిషన్ల పేరుతో గ్రామాల్లో తిరుగుతున్నారు. అడ్మిషన్ల పేరుతో సంబంధిత స్కూళ్ల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తుండడంతో వారు సతమతవుతున్నారు. జూన్ 6 నుంచి జూలై 6 వరకు ఆన్‌లైన్ విధానంలో డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి. అంటే పరీక్షల ప్రారంభానికి మరో నెల రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నెల రోజులు ఇంటి వద్ద (మిగతా 6వ పేజీలో..)

ప్రిపరేషన్‌కు అవకాశం ఇవ్వాలి



డీఎస్సీ అనేది నిరుద్యోగ యువతకు ఒక వరం. రాష్ట్ర ప్రభుత్వం 16,347 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రతిఒక్క అభ్యర్థి ప్రిపరేషన్ కావాలని కోరుకుంటారు. కానీ, ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కొందరు అభ్యర్థులు మాత్రం అడ్మిషన్ల కోసం తిరగాల్సి వస్తుంది. వారు డీఎస్సీకి చదువుకునేలా మేనేజ్‌మెంట్ అవకాశం ఇవ్వాలి.

-జోగి తిరుపతిరావు, జువాలజీ అధ్యాపకుడు, ఓ ప్రైవేట్ కళాశాల

ఒత్తిడి తగదు



ప్రైవేట్ విద్యాసంస్థల మధ్య పోటీతో సిబ్బంది నలిగిపోతున్నారు. అడ్మిషన్ల పేరుతో వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేయడం తగదు. ఎండలు తీవ్రంగా ఉన్నా అడ్మిషన్లకు పంపిస్తున్నారు. దీనివల్ల వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. డీఎస్సీకి చదువుకునేలా చూడాలి.

-బర్రి పురుషోత్తం, యువజన సంఘం మాజీ అధ్యక్షుడు, అక్కుపల్లి.



డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస్, జగన్ మోహన్‌ను ఆశీర్వదిస్తున్న ప్రధాన అర్చకులు

ఆదిత్యుని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్

అరసవల్లి/గార, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్, గురజాల ఎమ్మెల్యే జగన్ మోహన్ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఈవో భద్రజీ స్వాగతం పలికారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం వారికి స్వామివారి ప్రసాదాలను, జ్ఞాపికలను ఆలయ ఈవో అందజేశారు. అలాగే, గార మండలం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథుని కూడా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో కె.నరసింహనాయుడు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

‘చల్లని’ విషం.. ‘పచ్చని’ మోసం

- రసాయనాలతో పండ్లను మగ్గబెడుతున్న వైనం
- పండ్ల రసాల్లో అపరిశుభ్రమైన ఐస్
- కల్తీ నూనెలతో ఆహార పదార్థాల తయారీ
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

6లో



భూసార పరీక్ష.. రైతులకు రక్ష

- నివేదికను అనుసరిస్తే మంచి ఫలితాలు
- పెట్టుబడులు తగ్గుముఖం.. అధిక దిగుబడులూ సొంతం

6లో



నీట్‌కు పక్కాగా ఏర్పాట్లు

- జిల్లాలో నాలుగు కేంద్రాలు
- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, చిత్రంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీట్ పరీక్షను సజావుగా నిర్వహిస్తామని, మే 4వ తేదీన జరిగే ఈ పరీక్షల కోసం పక్కాగా ఏర్పాట్లు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్‌లతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఆర్‌జేయూకేటీ (ఎచ్చెర్ల), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (గుజరాతీపేట), ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (శ్రీకాకుళం), కేంద్రీయ విద్యాలయం (శ్రీకాకుళం) ఉన్నాయని తెలిపారు. మే 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు. ప్రతి అభ్యర్థి హాల్ టికెట్‌లో పొందుపరిచిన నిబంధనలు పాటించాలని సూచించారు. ఫొటోలు వీడియోలు తీయడం నిషేధమన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్తుకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య సిబ్బందితో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థుల రవాణా కోసం బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఫర్మేషన్ అధికారి కిరణ్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్, నీట్ సిటీ కోఆర్డినేటర్ సుహాయిబ్ ఆలయం, చీఫ్ సూపరింటెండెంట్ పీవీ రమణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆగని బాల్య వివాహాలు



- పెళ్లి పీటలెక్కుతున్న చిన్నారులు
- రాష్ట్రంలోనే మూడోస్థానంలో నిలిచిన జిల్లా
- చదువుకు దూరమవుతున్న వైనం
- జీవితాంతం వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

● ఇచ్ఛాపురం మండలంలోని ఓ మారుమూల గ్రామంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినికి వివాహం నిశ్చయమైంది. మంచి సంబంధమని భావించిన తల్లిదండ్రులు వివాహం జరిపించేందుకు సిద్ధపడ్డారు. కానీ అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో చైల్డ్‌లైన్ సిబ్బంది గ్రామానికి చేరుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో వారు వివాహాన్ని ఒక ఏడాది పాటు వాయిదా వేసుకున్నారు.

● ఒడిశా సరిహద్దు గ్రామంలో బాలికకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధపడ్డారు. సమాచారం అందుకున్న చైల్డ్‌లైన్ సిబ్బంది గ్రామానికి వెళ్లారు. పూర్తిస్థాయి వివరాలు సేకరించారు. చిన్ననాడే పెళ్లితో అనర్థాలున్నాయని.. జీవితాంతం అనారోగ్య సమస్యలు వెంటాడుతాయని చెప్పడంతో వారు వివాహ నిర్ణయాన్ని విరమించుకున్నారు.

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో బాల్య వివాహాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా తీర ప్రాంతంతో పాటు గిరిజన ప్రాంతాల్లో ఈ విష సంస్కృతి నడుస్తోంది. బడికెళ్లాల్సిన బాలికలు పెళ్లి పీటలెక్కుతున్నారు. తెలిసీ తెలియని వయసులో వారి మెడలో మూడు ముళ్లు పడుతున్నాయి. చదువు, ఆటపాటలతో హాయిగా గడపాల్సిన ఈడులో గర్భం దాల్చుతుండడంతో అనారోగ్య సమస్యలు జీవితాంతం వెంటాడుతున్నాయి. అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు, కట్టుబాట్లతో పెద్దలే చిన్నారులకు పెళ్లిచేసి అత్తారింటికి పంపుతున్నారు. అధికారులు అడ్డుకుంటున్నవి కొన్నే. కానీ అంతకు మించి బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పది, ఇంటర్ విద్యార్థినులను సైతం పెళ్లిపీటలు ఎక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.



మూడో స్థానంలో జిల్లా..

బాల్య వివాహాల గణాంకాలు పరిశీలిస్తే జిల్లా ప్రమాదంలో ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 45 శాతానికి మించి బాల్య వివాహాలు జరుగుతుండగా అందులో శ్రీకాకుళం జిల్లా మూడో స్థానంలో ఉంది. అందులో 15 నుంచి 18 ఏళ్లలోపు బాలికలు, యువతులు అమ్మలుగా మారుతున్నారు. బాల్యంలో తల్లులు కావడం వంటివి గతాని కంటే తగ్గాయి కానీ.. బాల్య వివాహాలు మాత్రం పెరుగుతున్నాయని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే స్పష్టం చేసింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ బాల్య వివాహాల ప్రభావం ఉంది. అయితే ప్రధానంగా జిల్లాలోని 11 తీర మండలాల్లో ఈ సామాజిక రక్కసి కొనసాగుతోంది. జీవనోపాధికి గాను ఎక్కువ మంది మత్స్యకారులు ఉపాధి బాట పడుతుంటారు. అటు వంటి సమయంలో చిన్నారులకు తోడు, భద్రత ఉంటుందని బాల్యవివాహాలు జరిపిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి ఉంది. నిరక్షరాస్యతే ప్రధాన కారణం కాగా.. ఆర్థిక వెనుకబాటు దృష్ట్యా మంచి సంబంధాలు వస్తుండడంతో ఎక్కువ మంది బాలికలకు పెళ్లి చేస్తున్నారు. కుటుంబ పరిస్థితులు, సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు వంటి ఘటనలు చూస్తున్న తల్లిదండ్రులు ఆడపిల్లలకు వివాహం జరిపిస్తే మేలన్న నిర్ణయానికి వస్తున్నారు.

గత ఐదేళ్లలో బాల్య వివాహాల వివరాలు..


ఏడాది	గుర్తించినవి	అడ్డుకున్నవి	ఎఫ్ఐఆర్ నమోదైనవి
2021	144	112	2
2022	68	68	0
2023	144	112	2
2024	28	28	0

ప్రాణాలకే ప్రమాదం..

బాల్య వివాహాలు ఎక్కువగా 12 నుంచి 17 సంవత్సరాల మధ్య జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఆ వయసులో ఉండాల్సిన బరువు కంటే తక్కువగా ఉంటారు. తల్లిగా మారే సమయంలో బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) తగ్గడంతో వారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల్లో బిడ్డ గర్భంలో చనిపోవడం, వైకల్యంతో పుట్టడం, ఆరోగ్యకరమైన ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. కేంద్ర ప్రభుత్వం బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేకంగా ‘బాల్ వివాహ్ ముక్త్ భారత్’ కార్యక్రమాన్ని చేపట్టింది. బాల్య వివాహాలు జరిగినట్టు (మిగతా 6వ పేజీలో..)

చల్లని విషం.. పచ్చని మోసం





- రసాయనాలతో పండ్లను మగ్గబెడుతున్న వైనం
- పండ్ల రసాల్లో అపరిశుభ్రమైన ఐస్
- కల్తీ నూనెలతో ఆహార పదార్థాల తయారీ
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

అరసవల్లి/నరసన్నపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)

ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. అవసరార్థం బయటకు వస్తున్న వారు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు కూల్ డ్రింక్స్, పండ్ల రసాలు తీసుకుంటున్నారు. ఇవి తాగేటప్పుడు తాత్కాలికంగా దాహం తీరినట్టు కనిపించినా... దీర్ఘకాలంలో వీటితో ప్రమాదమేనని వైద్యులు చెబుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ దొరికే డ్రింక్స్ తాగకపోవడమే మంచిదని సూచిస్తున్నారు.

● కృత్రిమ రంగులు..

వేసవిలో పండ్లు ప్రత్యేకంగా మామిడి, అరటి వంటి రకాలను పక్వానికి రాకుండానే కృత్రిమంగా పండించేందుకు, మంచి రంగు వచ్చేలా, ఆకర్షణీయంగా కనిపించేలా వివిధ రసాయనాలను వాడుతారు. ఎక్కువగా కాల్షియం కార్బైడ్, ఇథలీన్ వంటి రసాయనాలతో కృతిమంగా పండించి... రంగు వచ్చేలా చేస్తారు. ఈ రసాయనాల వినియోగం వల్ల ప్రజలు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది.

ధరలూ భారమే...

ఈ ఏడాది మామిడి పండ్ల ధరలూ ఆకాశాన్ని తాకుతున్నాయి. కిలో రూ.100 పలుకుతున్నాయి. ఈ ఏడాది మామిడి పంట తక్కువ కావడంతో గత ఏడాది కంటే ధర పెరిగింది. గత ఏడాది కిలో రూ.50 పలికితే.. ఈ ఏడాది కిలో రూ.100 ఉంటోంది. గత్యంతరం లేక తప్పనిసరి పరిస్థితిలో మామిడి పండ్లను కొంటున్నారు. ఇక తూకాల్లో మోసం ఉండనే ఉంది. కిలోకు సగటున 800 గ్రాములు తక్కువ ఉంటున్నాయి. సంబంధిత అధికారులు చూసీ చూడనట్టు వదిలేయడంతో వ్యాపారుల మోసాలకు అడ్డులేకుండా పోతోంది.

● గుర్తించడం ఎలా...?

రసాయనాలతో కృత్రిమంగా పండించిన పండ్లను గుర్తించడం ఎలా అనే సందేహం అందరిలో ఉంటుంది. నిజానికి ఇలా పండిన పండ్లు వాటి సహజమైన సువాసనను కోల్పోతాయి. అలాగే పండ్లపై చిన్న చిన్న రంధ్రాలు ఏర్పడతాయి. వాటిపై తెల్లని, పలుచని పొర లేదా పిండి వంటి పదార్థం మనకు కనిపిస్తుంది. ఇలాంటివి రసాయన పండ్లు అని మనం గుర్తించాలి.

● ఆ పండ్ల రసాలు తాగొద్దు..

వేసవిలో సేదతీరేందుకు ప్రజలు ఎక్కువగా పండ్ల రసాలను ఆశ్రయిస్తుంటారు. ఐస్‌తో కూడిన పండ్ల రసాలను తాగడం ఆరోగ్యకరం కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అపరిశుభ్రమైన నీటితో ఐస్‌ను తయారు చేయడం... అదే ఐస్‌ను పండ్ల రసాల్లో వినియోగించడం వల్ల గొంతునొప్పి, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. అందుకే ఐస్ లేకుండా పండ్ల రసాలను తీసుకోవడం ఉత్తమం.

● వ్యాధుల ముప్పు..

కృత్రిమంగా పండించిన పండ్లను తినడం వల్ల జీర్ణకోశ సంబంధ వ్యాధులు అధికంగా వస్తాయి. గొంతు నొప్పి, వికారం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే కేన్సర్ కూడా వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐస్‌తో కూడిన పండ్ల రసాలు తాగడం వల్ల ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు, అలర్జీలు సంభవిస్తాయి. సహజంగా పండించిన పండ్లను మాత్రమే కొనుగోలు చేసి ఆహారంగా తీసుకోవాలి.

● ప్యాకెట్ల ఆహారంతో జాగ్రత్త..

ప్రస్తుతం మార్కెట్‌లో వివిధ కంపెనీలు ఆహారాన్ని ఆకర్షణీయమైన ప్యాకెట్లతో అమ్ముతున్నాయి. ఇటువంటి ఆహార పదార్థాలను కొనుగోలు చేసేటప్పుడు వాటిపై ఐఎస్ఐ, ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ. గుర్తింపు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. తయారీ తేదీ తప్పనిసరిగా చూడాలి. గుర్తింపు లేని వాటిని కొనుగోలు చేయవద్దు. ప్యాకెట్లలో ఉండే ఆహారం పాడైపోకుండా నిల్వ ఉండేందుకు రసాయనాలను ప్రమాదకర స్థాయిలో వాడే అవకాశం ఉంటుంది. దీంతో తీవ్ర అనారోగ్యం పాలు కాక తప్పదు.

● ఫాస్ట్‌పుడ్ వినియోగంతో అనర్థాలు..

ప్రస్తుతం ఫోన్ ద్వారానే ఆర్డర్ చేసి ఇంటివద్దకే కోరుకున్న ఆహార పదార్థాలను తెప్పించుకునే వెసులుబాటు ఉండడంతో అనేక మంది ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్ల లోని ఆహారాన్ని కొనుగోలు చేస్తున్నారు. కానీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహార తయారీకి వినియోగించే నూనె, ఇత ర పదార్థాలు నాణ్యత ఎల్లప్పుడూ ప్రశ్నార్థకమే. రెండు సార్లకు మించి నూనెను మరిగించి, మరలా వినియోగి స్తే దాంతో ఎన్నో రోగాలు మనం డబ్బులిచ్చి కొనుకున్న ట్లే అవుతుంది. అందుకే ఇంటివద్ద తయారుచేసిన ఆహారానికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఫాస్ట్‌ఫుడ్‌తో పాటు కార్బొనేటెడ్ డ్రింక్స్ తాగడం ఈ మధ్య కొత్త అలవాటుగా మారింది. దీంతో ఉదరకోశ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ.

శీతల పానీయాలూ అంతే..

వేసవిలో శీతల పానీయాలు సేవిస్తూ ప్రజలు ఆనందాన్ని అనుభవించే ప్రయత్నం చేస్తుంటారు. నిజానికి వేడి వాతావరణంలో కూల్‌డ్రింక్స్ తాగడం ఎంతమాత్రం ఉపయోగకరం కాదు. ప్రత్యేకించి కార్బొనేటెడ్ కూల్ డ్రింక్స్‌తో జీర్ణవ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందువల్ల కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు, పరిశుభ్రమైన మంచినీరు, పలుచని మజ్జిగ వంటివి తీసుకోవాలి.

● కల్తీ చేస్తే క్రిమినల్ కేసులు..

పండ్లను కృత్రిమంగా పండించినా, ఆహార పదార్థాల తయారీలో నాణ్యత లేకున్నా... కల్తీ జరిగినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం స్పష్టం చేశారు. ప్రజలు ఐస్ లేని పండ్ల రసాలు తాగాలని... సహజంగా పండిన పండ్లను కొనుగోలు చేయాలని సూచించారు. ప్యాక్‌డ్ ఫుడ్, జ్యూస్‌లు కొనేటప్పుడు వాటిపై ఎఫ్ఎస్ఎస్ఏఐ లోగో, ఐఎస్ఐ మార్కు, తయారీ తేదీని తప్పక గమనించాలని కోరారు. అన్నిటికంటే ముఖ్యంగా జాగ్రత్తే పరమౌషధం అని గుర్తించాలన్నారు.

● రసాయనాలతో అనారోగ్యం..

ఈ కాలంలో విరివిగా లభించే మామిడితో పాటు సపోటా వంటి పండ్లను రసాయనాలతో పండిస్తున్నారు. ఇవి తింటే జీర్ణకోశ సమస్యలు తలెత్తుతాయి. రసాయనాలు చల్లే పండ్లను సునిశితంగా పరిశీలిస్తే వాటిపై పల్చని పొర ఉంటుంది. ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా నల్లగా మాగిపోతాయి.

-రెడ్డి భార్గవ్, వైద్యులు,
ఏరియా ఆసుపత్రి, నరసన్నపేట



సిగ్నల్స్ నిల్.. సేవలు డల్

(ఐదో పేజీ తరువాయి)

తగ్గించడం, రూ.149 బేసిక్ ప్లాన్‌ను తిరిగి ప్రవేశపెట్టేందుకు నిర్ణయించడంతో ఏపీ ఫైబర్ పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తుందన్న నమ్మకం కలుగుతోంది. జిల్లాలో మాత్రం వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించడంతో నెట్‌వర్క్ సమస్యలపై దృష్టిపెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

నిర్వహణ సరిగా లేదు..

ఇంటర్నెట్, కేబుల్, ల్యాండ్ ఫోన్ సౌకర్యం కలుగుతుందని చెప్పి ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ తీసుకున్నాం. రూ.149 బేసిక్ ప్లాన్‌ను రూ.350కు పెంచారు. ఆపై నిర్వహణ సరిగా లేదు. నెట్‌వర్క్ సదుపాయం పూర్తిగా పడిపోయింది. దీంతో ఇప్పుడు సేవలు నిలిచిపోతాయో తెలియడం లేదు. అందుకే గతం మాదిరిగా విడివిడిగా మూడింటి ప్రొవైడర్ సేవలు తీసుకున్నాం.

-రామారావు, వినియోగదారుడు, రణస్థలం

సిగ్నల్ సమస్య ఉంది..

జిల్లాలో ఏపీ ఫైబర్ నెట్ సేవల్లో ఎటువంటి పురోగతి లేదు. ముఖ్యంగా సిగ్నల్ సమస్యలు వేధిస్తున్నాయి. ఇతర ప్రైవేటు సంస్థల కంటే బేసిక్ ప్లాన్ అందుబాటులో ఉంది. కానీ ప్రైవేటు సంస్థలు ఇస్తున్న నాణ్యత ఇవ్వడం లేదు. నిర్వహణ సైతం బాగుండడం లేదు. ఇప్పటికైనా ఫైబర్ నెట్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేయాలి.

-అప్పలనాయుడు, వినియోగదారుడు, పిన్నింటిపేట

సేవలను విస్తరిస్తాం..

జిల్లాలో గతంలో కంటే ఏపీ ఫైబర్ నెట్ సేవలు పెరిగాయి. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ఉంది. సాంకేతిక సమస్యలను అధిగమించడంతో పాటు తక్కువ ధరకు బేసిక్ ప్లాన్ అందుబాటులోకి తేనుంది. ప్రతి గ్రామానికి ఫైబర్ నెట్ సేవలు విస్తరించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

-గౌతమ్, జిల్లా బిల్డింగ్ మేనేజర్, ఏపీ ఫైబర్ నెట్, శ్రీకాకుళం

ఆగని బాల్య వివాహాలు

(ఐదో పేజీ తరువాయి)

తెలిస్తే 1098, 181, 100 నంబర్లకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సమాచారం ఇవ్వొచ్చు. జిల్లా అధికారులు రంగంలోకి దిగి స్థానిక పోలీసుల సహకారంతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించవచ్చు.

1098కు ఫిర్యాదు చేయవచ్చు..

ఏటా విద్యాసంవత్సరం ముగిసిన తరువాత వివాహాలు జరిపిస్తుంటారు. ఆ సమయంలో చడీచప్పుడు కాకుండా ముహూర్తాలు ఖరారు చేస్తున్నారు. రహస్యంగా కూడా వివాహాలు జరిపిస్తున్న వారు ఉన్నారు. అయితే తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఎక్కువ మంది తల్లిదండ్రులు బాల్య వివాహాల వైపు మొగ్గుచూపుతున్నారు. కానీ వారు రకరకాల రుగ్మతలకు గురవుతున్నారు. జీవితాంతం మూల్యం చెల్లిస్తున్నారు. ఇటీవల బాలికల్లో కొంత చైతన్యం వచ్చింది. చిన్ననాటే వివాహాలు చేసుకోవడానికి ఇష్టపడని వారు నేరుగా 1098 టోల్‌ఫ్రీనంబర్‌కు ఫోన్ చేస్తున్నారు. బాల్య వివాహాల సమాచారం ఇస్తున్నారు. ఈ విషయంలో చైల్డ్‌లైన్‌తో పాటు అన్ని శాఖలు అవగాహన పెంచితే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

ఫిర్యాదు చేయాలి..



బాల్య వివాహాలు అత్యంత ప్రమాదకరం. బాధ్యత తీరిపోతుందని బాల్య వివాహాలు చేస్తే జీవితాంతం పిల్లలకు సమస్యలు వెంటాడుతాయి. అందుకే ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండకపోతే వారి పిల్లల భవిష్యత్‌కే ముప్పు ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. ఇదో సామాజిక బాధ్యతగా చూడాలి.

-కేవీ రమణ, జిల్లా బాలల రక్షణ అధికారి, శ్రీకాకుళం

ప్రమాదకరం..

బాల్య వివాహాలు చేయడం వల్ల ప్రసవ సమయంలో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. తల్లితో పాటు పుట్టిన బిడ్డకు ప్రమాదమే. సంతానోత్పత్తి సమయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. పుట్టిన పిల్లలతో పాటు తల్లికి తీవ్ర అనారోగ్యం తప్పదు. చిన్న వయసులోనే పెళ్లిళ్లతో అనేక రుగ్మతలు ఎదురుకాక తప్పదు. గైనిక్ సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్న వారిలో బాల్య వివాహ బాధితులే అధికం. ఈ విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

-పాతిర్ల దేవేంద్రరెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, ఇచ్ఛాపురం

భూసార పరీక్ష.. రైతులకు రక్ష

- నివేదికను అనుసరిస్తే మంచి ఫలితాలు
- పెట్టుబడులు తగ్గుముఖం.. అధిక దిగుబడులు సొంతం



దూకలపాడులో మట్టి నమునాలను సేకరిస్తున్న దృశ్యం

నరసన్నపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులు సాధించాలన్న తపనతో రైతులు పరిమితికి మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. ఈ కారణంగా భూమి సారం కోల్పోయి... పంటలు సరిగా పండక... దిగుబడులు తగ్గుతున్నాయి. దీంతో పెట్టుబడులు కూడా చేతికి అందక రైతులు నష్టపోతున్నారు. అంతేగాక ప్రకృతి వరప్రసాదినిగా ఉన్న పోషకాలు సైతం మొక్కలకు అందకపోవడం గమనార్హం. భూమిలో కొంత పరిమాణంలో సహజ సిద్ధంగా లవణ పరిమాణం, నత్రజని, పొటాష్ వంటి పోషకాలు ఉంటాయి. అవి ఎంతమేర మొక్కలకు లభ్యమవుతున్నాయో...వేయబోతున్న పంటకు అవి ఎంత మేర అవసరమో రైతులు నిర్ధారించుకున్నాకే ఎరువులు వినియోగించాలి. భూసార పరీక్షలు చేయిస్తేనే ఆ సమాచారం తెలుస్తుంది. అలా చేయకపోవడం వల్ల ఇష్టారాజ్యంగా ఎరువులు వేయడం వల్ల పెట్టుబడి పెరగడమే కాకుండా భూమిలో సారం క్రమేపీ తగ్గి.. చౌడు భూమిగా తయారయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఏడాది జిల్లాలో 36,250 భూసార పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయాదికారి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. మే 25న క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమునాలను సేకరించి భూసార కేంద్రాలకు పంపాలి. భూసార కేంద్రాలలో ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి... ఖరీఫ్ ప్రారంభంలోగా రైతులకు సమాచారం అందించాలని ఆదేశించారు.

● మట్టి నమూనా సేకరణ ఇలా..

పొలంలో 10 నుంచి 12 చోట్ల మట్టిని సేకరించి.. ఆ ప్రాంతాల్లో త్రిభూజాకారంలో 6 నుంచి 8 అంగుళాల మేర గుంత తవ్వాలి. పైపొర నుంచి కింద వరకు ఒకే మందంలో పలుచని పొర వచ్చేలా మట్టిని తీయాలి. ఈ మట్టిని సేకరించి గోనె సంచి మీద వేసి... నాలుగు భాగాలుగా విభజించాలి. ఎదురెదురుగా ఉన్న మట్టిని రెండు భాగాలుగా కలపాలి. ఇలా చేసి సుమారు అర కిలో మట్టి మిగిలేలా చేయాలి. సేకరించిన మట్టి నమునాను ఒక కవర్‌లో వేసి వ్యవసాయ శాఖ అధికారులకు అందజేస్తే భూసార పరీక్షలను నిర్వహించి ఫలితాలను అందజేస్తారు. మట్టి నమునాలో గ్రేడు విధానం అవలంభించడం వల్ల చుట్టు పక్కల సరాసరి పది మంది రైతుల భూసారం కూడా తెలుసుకునేందుగా వీలు కలుగుతుంది.

● రైతులు ఇవ్వాల్సిన సమాచారం..

మట్టి నమునా తీయించాలకున్న రైతు తన పేరు, ఆధార్ కార్డు, గ్రామం, పొలం సర్వే నెంబర్, సాగు పంటల స్థితి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలి. వారు పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి పోలాల్లో ఏఏ ధాతువుల లోపం ఉందనే విషయమై సమగ్ర నివేదికను అందజేస్తారు. లోపం ఉన్న ఎరువులను ఎంతెంత మోతాదులో వేయాలో ఈ నివేదిక ఉంటుంది కాబట్టి రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడులను సాధించవచ్చును.

లాభాలు ఇవే..

● సాగు చేసే భూమిలో ఏ ధాతువు గుణాలు తక్కువగా ఉన్నాయో.. ఏవి ఎక్కువగా ఉన్నాయో తెలుస్తుంది. ● భూసార పరీక్ష నివేదికను అనుసరించి మూడేళ్ల పాటు సేద్యం చేయవచ్చు. ● ప్రభుత్వం రాయితీపై అందజేసే జింక్, జిప్సం, విత్తనాలు తదితర వాటికి నమూనాలు చేయించుకున్న రైతులకు ప్రాధాన్యం ఇస్తారు. ● భూసార పరీక్షలు చేయించుకున్న రైతుకు ఏ సమయంలో ఏ ఎరువులు వేయాలనే విషయాన్ని కిసాన్ సెంటర్ నుంచి ఆ సమయాల్లో వాయిస్ కాల్ వస్తుంది. అలాగే ఎప్పటికప్పుడు సంక్షిప్త సమాచారాన్ని రైతులకు అందజేస్తుంటారు.

పరీక్షలు ఎందుకంటే..

పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి.... ఎంత మోతాదులో ఎరువులు, రసాయన మందులు వాడాలో తెలుసుకోవడమే భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశం. భూసార పరీక్షలు చేయించి వాటిని ఆచరించడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయి. పంటలో స్థిర మైన దిగుబడులు... నాణ్యమైన ఉత్పత్తి సాధించవచ్చు. అధిక దిగుబడులు పొందాలన్న ఆలోచనతో రైతులు అనవసరంగా ఎక్కువ స్థాయిలో ఎరువులు వాడటం ద్వారా నాణ్యమైన దిగుబడులు రాకపోగా.. చీడపీడల ఉధృతి... వాతావరణ కాలుష్యం తదితర సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి వాటిని అధిగమించడానికి నేలకు సంబంధించిన స్థితిగతులను తప్పనిసరిగా తెలుకోవాలి.

అవగాహన కల్పిస్తాం..

జిల్లాలో భూసార పరీక్షలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తులు సాధించేందుకు మారుతున్న కాలానికి అనుగుణంగా విచక్షణా రహితంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. వాటిని తగ్గించేందుకు ఈ పరీక్షలు నిర్వహించి... రైతులకు అవగాహన కల్పిస్తాం.

-కోరాడ త్రినాథస్వామి,
జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

అయినా.. కదలను

- నోటీసులు ఇచ్చినా స్పందించని వ్యక్తి
- వేణుగోపాలుని భూమిలో నందల తయారీ
- చోద్యం చూస్తున్న దేవదాయ శాఖ



ట్రస్టు భూమిలో తయారు చేసిన నందలు, స్తంభాలు

పొందూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు ఆక్రమణకు ఎగబడుతున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న అత్యంత విలువైన భూమి మీదా పడ్డారు. రాపాక కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రోడ్డు పక్కన భూమి విలువ ఆకాశాన్ని అంటుతోంది. శాలిహుండాం వేణుగోపాలస్వామి ఆలయ ట్రస్టుకు ఈ రోడ్డు పక్కన 198 సర్వే నంబరులో 1.47 ఎకరాల విలువైన భూమి ఉంది. రెవెన్యూ రికార్డులతో పాటు దేవదాయ శాఖకు సంబంధించిన 43 రికార్డులలోనూ శాలిహుండాం ట్రస్టు భూమిగానే ఉంది. రూ.కోట్ల విలువ చేసే ఈ భూమిని చేజిక్కించుకునేందుకు విశాఖలో స్థిరపడిన పొందూరుకు చెందిన వ్యక్తి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు. దశాబ్దాల కిందట సాగు చేశానని.. తిరిగి ఈ భూమిని తనకు లీజుకు ఇవ్వాలని ట్రస్టు చైర్మన్ మధురెడ్డికి వినతిపత్రం ఇచ్చాడు. దీనికి ట్రస్టు చైర్మన్ అంగీకరించలేదు. దీంతో ఆ వ్యక్తి తనకు అనుకూలంగా ఉన్న పొందూరుకు చెందిన మరో వ్యక్తితో ఈ భూమిని ఆక్రమింపజేసి... అక్కడ సిమెంటు నందలు తయారు చేయిస్తున్నాడు. ఇటీవల ట్రస్టు చైర్మన్ దేవదాయ శాఖ అధికారులతో కలిసి స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా నందల తయారీదారుడు స్థలాన్ని ఖాళీ చేయలేదు సరికదా.. మరింతగా ఆక్రమణకు పాల్పడుతున్నాడు. ట్రస్టు చైర్మన్ ప్రశ్నిస్తే.. ఖాళీ చేసేది లేదని... ఏం చేసుకుంటారో చేసుకోండని ఎదురు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. విలువైన దేవుని భూములు రక్షించాల్సిన దేవదాయ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా స్థలాన్ని ఖాళీ చేయించి.. ట్రస్టుకు ఆదాయం వచ్చే మార్గాలు చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అడ్మిషన్లకు తిరగలేక.. డీఎస్సీకి చదవలేక

(ఐదో పేజీ తరువాయి)

ఉండి చదువుకోవాలని అనుకుంటున్న తమకు కుదరడం లేదని ప్రైవేట్ టీచర్లు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 450 వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో పని చేస్తున్న ఉపాధ్యాయులపై అడ్మిషన్ల ఒత్తిడి ఉండడంతో ఏమిచేయాలో తెలియడం లేదని అంటున్నారు. పోని ప్రైవేటు ఉద్యోగం వదలేసి చదవుకుందామంటే, డీఎస్సీ రాకుంటే తరువాత పరిస్థితి ఏమిటనే సందిగ్ధంలో ఉన్నారు. వచ్చేఏడాది విద్యాసంవత్సరంలో టీచర్‌గా కొనసాగాలంటే వేసవి సెలవుల్లో అడ్మిషన్లు తీసుకురావాలని సంస్థలు టార్గెట్ పెడుతున్నాయి. అలా తెచ్చిన వారికి కొన్ని సంస్థలు పూర్తిస్థాయి జీతాలు ఇస్తుండగా, మరికొన్ని సంస్థలు మాత్రం నగం జీతాలు మాత్రమే ఇస్తున్నాయి. అడ్మిషన్‌కు తిరగని వారి విషయంలో స్కూళ్ల రీ ఓపెన్ సమయంలో విద్యాసంస్థలు తీసుకున్న నిర్ణయమే శిరోధార్యం.

అసిరితల్లికి ప్రత్యేక పూజలు

నరసన్నపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మాకివలస గ్రామదేవత అసిరితల్లి సంబరాల్లో భాగంగా మంగళవారం కాంచయ్యపేటలో గల సిరిమాను చెట్టుకు మహిళలు ముర్రాటలు చెల్లించి... మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా గ్రామంలో అసిరితల్లికి పూజలు చేశారు. అనంతరం సిరిమానుకు పసుపు, కుంకుమలతో అర్చించారు.



ముర్రాటలు చెల్లించేందుకు వెళుతున్న మహిళలు

బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బారువ బీచ్ ఫెస్టివల్‌ను వచ్చే నెల 3, 4 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాస్థాయి అధికారులతో, అలాగే మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. వాటర్ స్పోర్ట్స్, సంప్రదాయ బీచ్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో బీచ్ ఫెస్టివల్ ప్రత్యేకంగా ఉండాలన్నారు. సందర్శకులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే పింఛన్ పంపిణీ మే 1న ఉదయం నుంచే పకడ్బందీగా పంపిణీ చేయాలని, బుధవారం నాటికి డబ్బులు విత్‌డ్రా చేసు కోవాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఎప్పటిలాగే పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్ల వివరాలు, అనుమతులు లేని లేఔట్ల సమాచారం శుక్రవారం నాటికి కలెక్టరేట్‌కి తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యల లేకుండా చర్యలు తీసుకోవాలి, గోకులం షెడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసి, పశువులకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఫారం పాండ్లు పూర్తి చేయాలి, సూర్యఘర్ పథకం అమలులో జిల్లా స్థానం మరింత మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృధ్వీరాజ్‌కుమార్, ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీపీవో భారతీ సౌజన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుళాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు

అరసవల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని వ్యక్తిగత కుళాయిలకు విద్యుత్తు మోటార్లను ఉపయోగించి నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటిసారి పట్టుబడితే రూ.2 వేలు జరిమానా, రీకనెక్షన్ నిమిత్తం రూ.250 చెల్లించాల్సి ఉంటుందని, రెండవసారి గుర్తిస్తే కుళాయి కనక్షన్ శాశ్వతంగా తొలగిస్తామన్నారు. అలాగే ప్రతి కుళాయికి ట్యాప్ హెడ్ ఏర్పాటు చేసుకుని నీటి వృథా లేకుండా చూడాలని, ఇందుకు ప్రజలంతా సహకరించాలన్నారు.

లీజు ఆర్డరు ఇప్పించండి

కవిటి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురం గ్రామంలో ఉన్న శ్రీరామ కృష్ణ స్వదేశీ మత్స్యసహకార సంఘానికి బల్లిపుట్టుగ గ్రామ సమీపంలో ఉన్న తంపర భూములకు లీజు ఆర్డరు ఇప్పించాలని సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ మురళీమోహన్‌కు వినతిపత్రాన్ని అందించారు. మా సంఘంలో 200మంది సభ్యులు ఉన్నారన్నారు. సంఘ అధ్యక్షుడు త్రినాథ్ బెహరా, సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కళ అయిన తైక్వాండో వేసవి శిక్షణా శిబిరాలు మే 1వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు ఆ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను తెలిపారు. నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 3.30 నుంచి 7.30 గంటల వరకు తర్ఫీదు ఇస్తామన్నారు. నగరంలోని టౌన్ హాల్ వేదికగా స్కూల్ ఆఫ్ తైక్వాండోలో శిక్షణను గౌతమ్, నవీన్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

బారువా బీచ్ పరిశీలన


పరిశీలిస్తున్న పర్యాటకశాఖాధికారి

సోంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు బారువ బీచ్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాశ్వత హట్ నిర్మాణం నేటినుంచి (బుధవారం) పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ పర్యటనలో టీడీపీ నాయకుడు మద్దు కుమార్ తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పయనం


రెయ్యి సరస్వతి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఇచ్ఛాపురం కాదాలక్ష్మి కాంతమ్మ మునిసిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని రెయ్యి సరస్వతి ఎంపికైనట్టు హెచ్ఎం రమణమ్మ తెలిపారు. ఈ నెల 30నుంచి మే 4వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సరస్వతి మంగళవారం పయనమైనట్టు తెలిపారు. చిత్తూరులో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. సందర్భంగా పాఠశాల హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

గార ఎస్ఐకు స్థాన చలనం

శ్రీకాకుళం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా రోజుల తర్వాత ఓ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను వీఆర్‌కు పంపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం శ్రీకాకుళం నియోజకవర్గంలో గార పోలీసు స్టేషన్ ఎస్ఐ ఆర్ జనార్దనరావును వేకెంట్ రిజర్వ్‌కు పంపేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కంచిలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం, కొత్త రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కంచిలి భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఆరు ట్రై సైకిళ్లతోపాటు సీపీ ఛైర్స్, వినికిడి యంత్రాలు అందించారు. మహిళలకు కోసం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. కంచిలిలో జూన్ ఒకటో తేదీ నుంచి పది రోజులపాటు నిర్వహించనున్న కంచమ్మ తల్లి సంబరాలు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సంబరాల కమిటీ, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఐ మంగరాజు, పాఠశాల ఎస్వో రజనీ కుమారి, ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ రమేష్ కుమార్, ఎస్ఐ పారినాయుడు, ఈడీ గడ్డమ్మ, ఎంఈవో పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవ ర్యాలీ జయప్రదం చేయాలి

అరసవల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే నాడు నగరంలోని డైమండ్ పార్కు నుంచి ఏడురోడ్ల కూడలి వరకు నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం రిమ్స్ కార్మికులతో మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని, హక్కుల సాధనకు ఉద్యమించిన రోజును స్ఫూర్తిగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కె.రవి, సంతు, టి.కుమారి, సూరీడమ్మ, సీహెచ్ మీనాకుమారి, జీజీహెచ్ సానిటేషన్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నిరాహార దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

అరసవల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి అప్పయ్య ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 129 డిపోల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల నిరాహారదీక్షలో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌కే రావు, వుయ్యూరు సుబ్రహ్మణ్యం, నవీన్, శాంతరాజు, వీఎస్ఎం రావు, పార్వతి, లక్ష్మి, క్రిష్ణ, ఆర్‌యూబీ రావు, ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తారకనామ యజ్ఞానికి అంకురార్పణ


గంగాజలాన్ని గ్రామానికి తీసుకువస్తున్న భక్తులు

కవిటి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చిన్నకర్రివానిపాలెం గ్రామంలో తారకనామ యజ్ఞం నిర్వహణకు మంగళవారం అంకురార్పణ చేశారు. గ్రామంలోని కాశీవిశ్వనాథస్వామి దేవాలయ ఆవరణలో ఈ నామయజ్ఞాన్ని చేపడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. మంగళవారం సముద్ర తీరంలో ప్రత్యేకపూజలు నిర్వహించి గంగా హారతి ఇచ్చి జలాన్ని తీసుకువచ్చి యజ్ఞకుండలిని ప్రారంభించారు. సింహద్వార ప్రతిష్ఠ చేపట్టనున్నారు. ఐదు రోజులపాటు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మత్స్యకార భరోసా పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

గార, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం ఉదయం ఆయన బలరాంపురంలో మత్సకారుల భరోసా అందజేశారు. తొలుత సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు.. వేట నిషేధ భృతిని రూ.20వేలు చొప్పున అందించారు. ఇంకా కొంతమంది మత్స్యకారులకు భరోసా అందలేదని తన దృష్టికి వచ్చిందని, ఈ విషయమై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒడిశా ఎమ్మెల్యే దృష్టికి తాగునీటి సమస్య

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలో నీటి ఎద్దడి నివారణలో భాగంగా మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఒడిశా రాష్ట్రం చీకటి నియోజకవర్గం ఎమ్మెల్యే మనోరంజన్‌ను మంగళవారం కలిసి సమస్య వివరించారు. కొద్ది రోజులుగా బాహుదానదిలో నీరు లేకపోవడంతో మునిసిపాలిటీ ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, బగలబట్టి డ్యాం నుంచి కొంత నీటిని విడుదల చేయాలని కోరారు. నీటి సాంద్రత తక్కువ ఉన్నందున దిగువకు నీరు వదలడం కుదరదని, నీటి మట్టం పెరిగిన వెంటనే తప్పకుండా విడుదల చేస్తామని చెప్పినట్టు కమిషనర్ తెలిపారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

అరసవల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టినట్టు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. పట్టణ పరిధిలోని కాలువల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం నగరంలో పలుచోట్ల కాలువల్లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న చెత్తను యంత్రాల సాయంతో తొలగిస్తున్నామన్నారు. దీంతో వర్షాకాలంలో వర్షపు నీరు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రవహిస్తుందని, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఘనంగా ప్రపంచ నృత్య దినోత్సవం


పాల్గొన్న నృత్యకారులు

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం ప్రపంచ నృత్య దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాన్ని అందుకున్న నృత్య కళాకారుడు శ్రీభాష్యం రామ కౌండన్యకు, సాగరికకు, నృత్యదర్శకుడు రఘుపాత్రుని శ్రీకాంత్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ శిష్య బృందం నృత్య ప్రదర్శనలు చేశారు.

మంత్రి అచ్చెన్నను కలిసిన అవినాష్



ఎచ్చెర్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఎంపికైన చౌదరి అవినాష్ తన భార్యతో కలిసి మంగళవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై ఎంతో నమ్మకంగా ఈ పదవిని అప్పగించారని, బాధ్యతగా చేస్తానని అవినాష్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను డీసీఎంఎస్ తరపున తన వంతు కృషిచేస్తానని అవినాష్ చెప్పారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఎచ్చెర్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం గ్రామానికి సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా విచ్చేసి మత్స్యకార భరోసా అందించడంపై కూటమి నేతలు, మత్స్యకారులు మంగళవారం వారి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన మత్స్యకార సంఘ నేత చీకటి శ్రీరాములు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార భరోసాను రెట్టింపు చేసి రూ.20 వేలు అందజేయడం ఆనందం వ్యక్తంచేశారు.

నేడు ఇచ్ఛాపురం మునిసిపల్ సమావేశం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం 11గంటలకు మునిపపల్ సాధారణ నిర్వహించనున్నట్టు ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ సమావేశం అనంతరం అత్యవసర సమావేశం ఉంటుందన్నారు. అధికారులు, సభ్యులు పాల్గొనాలన్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారిలోని చెట్టు నరికివేత


చెట్టును నరికి తరలించుకుపోతున్న దృశ్యం

బూర్జ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తుడ్డలి గ్రామం వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిలో దశాబ్దాల కాలం నాటి మద్ది చెట్టును అక్రమంగా నరికి తరలించుకుపోయారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అడ్డంగా ఉండడంతో దీనిని తొలగించినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇంత జరిగినా అర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ జేఈను వివరణ కోరగా.. ఇది నా దృష్టికి రాలేదు. బుధవారం పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆమదాలవలస, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన నాకు ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సేవ చేసే అదృష్టం కల్పించారని డీసీసీబీ ఛైర్మన్‌గా ఎంపికైన శివ్వాల సూర్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ తూర్పుకాపు నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సూర్యనారాయణకు పదవి ఇవ్వడంపై విశ్వప్రసాద్‌తో పాటు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు, జిల్లా తూర్పుకాపు సాధికారి అధ్యక్షుడు పల్లి సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు నందివాడ గోవిందరావు, అంబళ్ల రాంబాబు, రాంజీ, టి.వెంకటరమణ, ఎం.శ్రీరాములునాయుడు, ఎల్.పూర్ణారావు పాల్గొన్నారు.

శివారు భూములకు నీరందించండి


నిరసన తెలుపుతున్న రైతు సంఘ నాయకులు, రైతులు

అరసవల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి శివారు భూములకు సాగునీరు అందించాలని రైతు సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తోటపాలెం, కొత్తపేట, సెగిడిపేట, అంబేడ్కర్ నగర్, ముద్దాడ, రుప్పపేట, రామజోగిపేట గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మే 7న శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నారాయణపురం కుడి కాలువ శివారు భూములకు వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ రామజోగిపేట వద్ద రైతులతో కలిసి ధర్నా చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రైతు చైతన్య జీపుజాత మే 2న ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ పూడివలస వద్ద ప్రారంభిస్తారని తెలిపారు. సంఘ ప్రతినిధులు వెలమల రమణ, సూర్యనారాయణ, అరసవల్లి రామారావు పాల్గొన్నారు.

శివప్రసాద్‌కు నియామక పత్రం అందజేత

పొందూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విశాఖ ఎయిర్‌పోర్టు సలహాకమిటీ సభ్యుడిగా నియమితులైన కింతలి గ్రామానికి చెందిన దుంపల శివప్రసాద్‌కు బుధవారం ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లంకా రాజేంద్రప్రసాద్ నియామకపత్రాన్ని అందించారు. ఇటీవల కేంద్రప్రభుత్వం విశాఖ విమానాశ్రయానికి ఏడుగురు సభ్యులతో సలహా కమిటీని నియమించింది. శివప్రసాద్ నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.

యూపీఎస్సీ ర్యాంకర్‌కు అభినందన


తల్లిదండ్రులతోపాటు మోహినిని సత్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్ఎం పురం పంచాయతీ లింగాల పేటకు చెందిన రావాడ సాయి మోహిని మానస ఇటీవల ప్రకటించిన యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 975వ ర్యాంకు సాధించారు. ఈమెను తన స్వగ్రామంలో మంగళవారం గ్రామస్థులు సత్కరించారు. ఓ వైపు మెడికల్ ఆఫీసర్‌గా సేవలందిస్తూనే, మరో వైపు యూపీఎస్సీలో ర్యాంకు సాధించడంపై గ్రామస్థులు అభినందించారు. తల్లిదండ్రులు ఉషారాణి, ప్రకాశరావును సన్మానించారు.

అంతర్జాతీయ జర్నల్‌లో పరిశోధన వ్యాసం

ఎచ్చెర్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గురుగుబెల్లి కృష్ణ, సరుబుజ్జిలి మండలం బుర్రంపేట గ్రామానికి చెందిన డాక్టర్ గురుగుబెల్లి తిరుమలరావు (ఎస్ఆర్ యూనివర్సిటీ, వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్) కలిసి రాసిన పరిశోధనా పత్రం అంతర్జాతీయ జర్నల్ (జర్నల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ కెమికల్ ఇంజనీరింగ్)లో ప్రచు రితమైంది. సూర్యకాంతిని మరింతగా గ్రహించడం, ఛార్జ్ సెపరేషన్ మెరుగుపడడం, రెడాక్స్ సామర్థ్యం పెరగడం వంటి అంశాల్లో ఈ కొత్త నానో కాంపోజిట్ల విశిష్టతను వివరించారు.

ఘనంగా అమ్మవారి ఘటాల పండగ

ఆమదాలవలస, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణ ఇలవేల్పు పాలపోలమ్మతల్లి ఘటాల పండగను మంగళవారం నిర్వహించారు. పురపాలక సంఘంలోని 16వ వార్డు పరిధిలోని డాబాలవారివీధి కూరగాయల మార్కెట్, శివనారాయణ, క్వార్టర్స్ వరదావారి క్వార్టర్స్ ప్రాంత మహిళలు ఘటాలతో పాలపోలమ్మ తల్లి గుడికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పులివేషాలు, తప్పెటగుళ్లు, జానపద నృత్యాలతో కోలాహలంగా ఊరేగింపు సాగింది. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి మరణకాండ సృష్టించటం హేయమైన చర్య అని మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజులు రెడ్డి అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి మంగళవారం యూకాంప్లెక్స్ కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దాసరి రాజు, కొండా శంకర్‌రెడ్డి, చాట్ల లోహిదాస్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

● గుజరాతీపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళులర్పిస్తూ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏడు రోడ్ల కూడలిలో మంగళవారం నిరసన తెలిపారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబురావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, పూర్వ కార్యదర్శి గొంటి గిరిధర్, ప్రతినిధులు బి.ధనలక్ష్మి, బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎడారిని తలపిస్తున్నాయి

- చుక్కనీరు లేని మహేంద్రతనయ, బాహుదా
- సాగు, తాగునీటికి అవస్థలు


ఇచ్ఛాపురం: ఎడారిలా మారిన బాహుదా నది


మెళియాపుట్టి వద్ద చుక్కనీరు లేని మహేంద్రతనయ

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాహుదా నది ఎడారిని తలపిస్తోంది. రైల్వే వంతెన వద్ద చుక్క నీరు లేక కనిపిస్తోంది. ఇచ్ఛాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు తాగు, సాగునీరందించే బహుదా నదిలో ఇప్పుడు కనీస స్థాయిలో నీరు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఒక పక్క ఎండల తీవ్రత రోజురోజుకూ ఎక్కువవుతుండడం, ఒడిశాలో ప్రాజెక్టుల్లో అక్రమ నిర్మాణాలతో చుక్క నీరు కిందకు రావడం లేదు. దీంతో సాగు, తాగునీటికి అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. భారీ వర్షాలు పడినప్పుడు వరదపోటు, ఎండాకాలంలో ఎండమావిగా మారుతుండడం బాహుదా నదికి అలవాటేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

మహేంద్రతనయ కూడా..

మెళియాపుట్టి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ప్రవహిస్తున్న మహేంద్రతనయ నది ఇలా ఎడారిలా తయారైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నీటి ప్రవాహం, భూగర్భ జలాలు అడుగంటడంతో ఈ పరిస్థితి ఎదురైంది. దీనివల్ల ప్రజలు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఒడిశా ఎగువ భాగంలో రైతులు నదికి అడ్డుకట్టలు వేయడంతో ఈ పరిస్థితి ఎదురైందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

శుభలేఖలు పంచి తిరిగి వస్తుండగా..

- కొత్తకోట సమీపంలో రోడ్డు ప్రమాదం
- చికిత్స పొందుతూ కుటుంబ పెద్ద మృతి
- పెళ్లింట విషాదం


అప్పారావు(ఫైల్)

సరుబుజ్జిలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పెళ్లింట విషాదం చోటుచేసుకుంది. సందడిగా ఉండాల్సిన ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మూల సవలాపురం గ్రామానికి చెందిన గూడాల అప్పారావు (57) తన కుమారుడికి వచ్చే నెల 13న వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఈ క్రమంలో భార్య కుమారితో కలిసి సోమవారం పలు గ్రామాల్లో బంధువులకు పెళ్లికార్డులు పంచాడు. రాత్రికి తిరిగి ఇంటి వస్తుండగా.. అలికాం-బత్తిలి రహదారిలో ఈదురుగాలులతో కూడి వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకటిగా మారింది. కొత్తకోట కూడలికి వచ్చేసరికి ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. అతడిని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో అప్పారావు తీవ్రంగా గాయపడ్డాడు. భార్య కుమారికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే వీరిని 108 వాహనంలో రాగోలు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసు పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అప్పారావు మృతి చెందాడు. కళ్లెదుటే భర్త మృతి చెందడం, మరోవైపు కుమారుడి వివాహం ఆగిపోవడంతో ఆ తల్లితోపాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ మెండ జనార్దనరావు తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య


పూర్ణచంద్ర (ఫైల్)

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇచ్ఛాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల మేరకు.. పట్టణ పరిధి కండ్రవీధికి చెందిన పూర్ణచంద్ర బెహరా మద్యానికి బానిసై తరచూ భార్య రేవతితో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భార్యతో గొడవపడ్డాడు. అనంతరం రేవతి భోజనం పెట్టినా తినకుండా ఇంటి మధ్యలో ఉన్న గదిలోకి వెళ్లి గెడపెట్టుకున్నాడు. తలుపు కొట్టినా తీయలేదు. ఇదే సమయంలో గదిలో ఉన్న తాడు ను మెడకు గట్టిగా బిగించుకున్నాడు. మరిది సాయంతో రేవతి తలుపులు తీసి కొన ఊపిరితో ఉన్న పూర్ణచంద్రను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

రణస్థలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దన్నానపేట సమీపంలో జాతీయ రహదారిపై పాతపెట్రోల్ బంకు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వెంకటరావుపేట గ్రామానికి చెందిన ఎ.బ్రహ్మాజీరావు, నగరప్పాలెం గ్రామానికి చెందిన కరిమజ్జి మోహన్‌తో పాటు మరో వ్యక్తి రణస్థలం నుంచి కోష్టకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాంగ్‌రూట్‌లో దుర్గారావు, మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తూ ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో బ్రహ్మాజీరావుతో పాటు కరిమజ్జి మోహన్, కరిమజ్జి కృష్ణవేణి, చిత్తిరి పద్మ, వి.దుర్గారావు, ఎస్.విజయ్ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. బ్రహ్మాజీరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో మహిళ అరెస్టు

సోంపేట/కంచిలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కంచిలి మెయిన్‌రోడ్డులో 100 ప్యాకెట్ల సారాతో పి.పార్వతిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్, మొబైల్, సీఐలు కె.బేబీ, జీవీ రమణ, తెలిపారు. ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

మట్టి తరలింపుపై ఫిర్యాదు

కొత్తూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో ఉన్న వంశధార నది వరద కాలువ మట్టిని తవ్వి అక్రమంగా తరలించడంపై వంశధార ప్రాజెక్టు సబ్ డివిజనల్ యూనిట్-3 అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా కొత్తూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మట్టిని తవ్వి వరద గట్టుకు తీవ్ర నష్టం కలిగించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును రెవెన్యూశాఖాధికారులకు సిఫారసు చేసినట్లు ఎస్‌ఐ అమీర్ ఆలీ తెలిపారు.

చింతలబడవంజ కాలనీలో చోరీ


ఇంటిలోని బీరువాను పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ, సిబ్బంది

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చింతలబడవంజ కాలనీలో సోమవారం సాయంత్రం బంగారం, వెండి నగలతోపాటు నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. పోలీసులు తెలి పిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రొంపివలస రమణ ఆటో నడుపుకునేందుకు వెళ్లగా, భార్య ఉపాధి పనికి వెళ్లింది. అయితే గుర్తుతెలియని వ్యక్తులు తాళం చెవిని తీసి బంగారు, వెండి వస్తువులను తీసుకుని వెళ్లిపోయారు. బాధితు లు తిరిగి ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. మూడు తులాల బంగారు, పది తులాల వెండి, రూ.9వేల నగదు పట్టుకువెళ్లి పోయారని బాధితుడు తెలిపారు. మంగళవారం ఘటనా స్థలానికి ఆమదాల వలస సీఐ సత్యనారాయణ, సరుబుజ్జిలి ఎస్‌ఐ ఎస్.బాలరాజు సమక్షంలో క్లూస్‌టీం వేలి ముద్రలను సేకరించారు. బాధితుడు రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెన్సిల్ ముల్లుపై సింహాద్రి అప్పన్న నిజరూపం



నరసన్నపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతపేటకు చెందిన వీఎస్ఎన్ నరసింహాచారి పెన్సిల్ ముల్లుపై సింహాచలం అప్పన్న స్వామి నిజ రూపాన్ని చెక్కి అబ్బురపరిచారు. బుధవారం వరహాలక్ష్మీ నరసింహా స్వామి చందనోత్సవం సందర్భంగా దీనిని మూడు గంటల్లో చెక్కినట్లు ఆయ న తెలిపారు. గతంలో ఆయన పెన్సిల్ ముల్లుపై అనేక చిత్రాలను చెక్కారు.

నేటినుంచి చందనం పూతతో స్వామి దర్శనం

టెక్కలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం నుంచి మూడు రోజుల పాటు స్వామి వారు చందనం పూతతో దర్శనమిస్తారని ఆలయ అర్చకు లు సీహెచ్‌వీ రమణాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

హిరమండలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇటువంటి శిక్షణలను అందిస్తోందని, వీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, ఎంపీడీవో కాళీప్రసాదరావు, ఎంఈవో కె.రాంబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరిపతిరావు, టీడీపీ నేతలు యాళ్ల నాగేశ్వరరావు, లాడే కృష్ణ, హెచ్ఎం టి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ ఓట్లు ఒకే దగ్గర ఉండాలి: జడ్పీ సీఈవో


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధరరాజా

పాతపట్నం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఒక కుటుంబానికి చెందిన ఓట్లు ఒక దగ్గర ఉండేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ఎల్‌వీఎస్ శ్రీధర రాజా అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో సవరణలు, తొలగింపులు, నమోదులపై క్షేత్రస్థాయి నాయకులతో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. బీఎల్వోలకు ఓటర్ల జాబితా సవరణలపై ఇప్పటికే శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించడం ద్వారా ఓటర్ల జాబితా సవరణలో భాగస్వామ్యం కావాలన్నారు. మరణించిన వ్యక్తుల ఓట్లను ఎప్పటికప్పుడు తొలగించాలని బీఎల్వోలు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యం

దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యం కావాలని జడ్పీ సీఈవో ఎల్‌వీఎస్ శ్రీధరరాజా అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనపై సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు


నరసన్నపేట: దాసరివానిపేటలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): యారబాడు, దాసరివానిపేట గ్రామాల్లోని నీలమ్మతల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా మంగళవారం సామూహిక కుంకుమ పూజ లు చేపట్టారు. యారబాడులో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గారమ్మతల్లి ఉత్సవాలు..

కోటబొమ్మాళి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురంలో గారమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూడు లేదా ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాలను 60 కుటుంబాలు ఒకేసారి నిర్వహిస్తారు. డోకి మోహనరావు కుటుంబ సభ్యులు మొదట అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. రమణమూర్తి, గౌరి శంకర్, భాస్కర్ రావు, వీరభద్రరావు ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేపట్టారు.

జగనన్న లేఅవుట్ల పేరుతో రియల్ వ్యాపారం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: కలమట



కొత్తూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ లేఅవుట్ల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి కోరారు. మంగళవారం మాతల క్యాంపు కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ.. వైసీపీ నేతలు, అధికారులు కుమ్మక్కై రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వానికి నష్టం చేకూరిందన్నారు. బాధ్యులైన ఏ ఒక్క అధికారి, వైసీపీ నేతలను వదిలి పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

చెరువు ఆక్రమణదారులకు నోటీసులు


చెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జె.రామారావు

జలుమూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): లింగాలవలస రెవెన్యూ పరిధిలోని చంద్రశేఖర్ (బాపనవానిచెరువు) చెరువు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ జన్ని రామారావు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం చెరువులో ఆక్రమణలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ చెరువు 4 ఎకరాల 10 సెంట్లు విస్తీర్ణం కాగా 1.20 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించామన్నారు. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని 7ఎ నోటీసులు జారీచేశామన్నారు. లేకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, ఆర్ఐ కిరణ్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్వో రాము పాల్గొన్నారు.

వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలి: ఎంజీఆర్

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్య కడపలగెడ్డ రోడ్డుపై వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మంగళవారం పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. జూన్ నెల నుంచి వర్షాలు ప్రారంభమై కడపలగెడ్డ రోడ్డుపై నుంచి అధికంగా నీరు ప్రవహించి దబ్బపాడు గ్రామస్థులకు మూడు నెలలపాటు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉన్నందువల్ల ఈలోగా పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులకు సూచిం చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, ఆర్‌అండ్‌బీ డీఈ గోపాల్, నాయకులు వి.ఆనంద రావు, సీహెచ్ శ్రీనివాసరావు, కె.కృష్ణమాచారి, వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవమా?


శంకుస్థాపన, ప్రారంభోత్సవం ఉన్న శిలాఫలకం (వృత్తంలో)

కడపలగెడ్డ రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకంపై ప్రారంభోత్సవ తేదీని చెక్కడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకుండానే ఎలా ప్రారంభిస్తారని పలువురు అంటున్నారు. శిలా ఫలకం తయారీ సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నీలమణి దుర్గమ్మ ఆలయ ఉత్సవాలు ప్రారంభం

పాతపట్నం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణిదుర్గ ఆలయ 50వ వార్షిక యాత్రా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, సుధీష్ణ దంపతులకు ఆలయ అధికారులు మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వాగతం పలుకగా అమ్మవారికి వారు పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, వర్ధనీ కలశ స్థాపన విఘ్నేశ్వర పూజ, పంచ గవ్య ప్రాశన తదితర కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. తొలిరోజు అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

పాతపట్నం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలోని సమస్యలను పరిష్క రించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు సోమవారం రాత్రి సీఎం చంద్రబాబు నాయుడును ఉండవిల్లిలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ, ఎల్ఎన్‌పేటలో పోలీస్ స్టేషన్, పాతపట్నంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలో పాడైన ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

గురుకుల కళాశాలల్లో చేరేందుకు దరఖాస్తులు

మెళియాపుట్టి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గురుకుల జూనియర్ కళాశాలల్లో చేరేందుకు అర్హులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమడి బాలుర కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీల్లో 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. సీతంపేట బాలుర కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీల్లో 40 చొప్పున, ఏఅండ్‌టీ 20, సీజీఏ 30 సీట్లు ఉన్నాయని తెలిపారు. సీతంపేట బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ 120 చొప్పున, సీఈసీ 40, హెచ్ఈసీ 80, ఎఅండ్‌టీ 40, సీజీఏలో 30 మంది చదువు కునేందుకు అవకాశం ఉందన్నారు. పదో తరగతిలో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మే 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 24న కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ఆ ప్రకటనలో తెలిపారు.

వివిధ అంశాల్లో జాతీయ స్థాయి పోటీలు

టెక్కలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించినట్లు ఐతమ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, ఆల్‌ఇండియా స్టూడెంట్స్ యూనియన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించగా 345 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. క్విజ్, డిజిటల్ పోస్టర్ మేకింగ్, వ్యాసరచన, స్లోగన్ రైటింగ్, ఎవేర్‌నెస్ రీల్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విజేతలుగా డాక్టర్ జ్ఞానేశ్వరి, వీరభద్రా ఊట్ల (ఐతమ్ కళాశాల)తో పాటు యూపీ, వెస్ట్ బెంగాల్, రాజస్థాన్, ఢిల్లీ, పాట్నా, బిహార్‌లకు చెందిన 16మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరికి ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు.

ఉపాధి వేతనదారులందరికీ పని కల్పిస్తాం

పోలాకి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వనవిష్ణుపురం గ్రామంలో ఉపాధి పనులు త్వరలో ప్రారం భిస్తామని, వేతనదారులందరికీ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఉన్నందున సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపడతామన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరు 8న గ్రామంలో జరిగిన హత్య నేపథ్యంలో ఇంకా 144 సెక్షన్ అమలు చేస్తున్నారని, దీంతో గ్రామంలో ఉపాధి పనులు జరగడం లేదన్నారు. ఉపాధి పనులు కల్పిస్తే మళ్లీ తగా దాలు తలెత్తే అవకాశం ఉన్నందున, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రంజిత్, ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ బి.పద్మావతి తదితరులు సమీక్షించి కలెక్టర్ అనుమతి కోసం లేఖ రాయనున్నామన్నారు. గ్రామపెద్దల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుని మేలో జరగనున్న అమ్మవారి సంబరాలకు అనుమతి ఇస్తామన్నారు. త్వరలో ఇరువర్గాలతో మాట్లాడి తగుచర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పని కల్పించాలని వేతనదారులు మంగళవారం వినతిపత్రాలు అందించారు.

కిశోరీ వికాసం సమ్మర్ క్యాంపెయిన్

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కిశోరీ వికాసం పేరుతో వేసవి స్పెషల్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో పార్వతి పేర్కొన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఎన్ఎంలు, వీవోఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు ప్రతి మంగళ, శుక్రవారాల్లో కిశోరీ బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవోపీఆర్డీ తిరుమలరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు డీఎస్సీ గ్రాండ్ మోడల్ టెస్ట్

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గురుడుభద్ర గ్రామంలో గురువారం రాష్ట్రస్థాయి డీఎస్సీ గ్రాండ్ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సైనింగ్ స్టార్ యువజన సంఘం అధ్యక్షుడు ఎ.సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ టెస్ట్ నిర్వహించనున్నా మన్నారు. డీఎస్సీ సిలబస్‌కు అనుగుణంగా ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందన్నారు, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నెట్ ఉన్న సెల్‌ఫోన్, ట్యాబ్ తెచ్చుకోవాలని సూచించారు.

ముగ్గురు వీఆర్వోల నియామకం

హిరమండలం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ముగ్గురు వీఆర్వోలను నియ మించినట్టు తహసీల్దార్ హనుమంతురావు తెలిపారు. వీరు పదోన్నతిపై మండలానికి వచ్చారన్నారు. డి.ఇందుశేఖర్ మదనాపురం నుంచి కల్లటకు, ఎస్.కోమలిదేవి శ్రీకాకుళం అర్బ న్ నుంచి మర్రిగూడకు, డి.లక్ష్మణరావు పైడిభీమవరం నుంచి రుగడ వీఆర్వోగా బదిలీపై వచ్చారని ఆయన తెలిపారు.

మేడేని విజయవంతం చేయండి

జలుమూరు/పోలాకి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కోరారు. జలుమూరు, పోలాకిల్లో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రామిక సంఘం జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సీఐటీయూ మండల కన్వీనర్ శిమ్మయ్య, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.కొండయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

నందిగాం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం పంచాయతీ పాతినవానిపేటలో కనక దుర్గమ్మతల్లి ఆలయ పదో వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవ చనం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

సంక్షేమ సారథి సీఎం చంద్రబాబు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 29 (ఆంధజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సారథి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కర్రసాము పోటీలకు 'పేట' చిన్నారులు

నరసన్నపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏలూరులో రాష్ట్రస్థాయి బుధవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి కర్రసాము పోటీలకు నరసన్నపేట పట్టణానికి చెందిన 30 మంది బాల బాలికలు పాల్గొంటున్నారని కోచ్ ఎ.చిన్నారావు తెలిపారు. ఈ మేరకు వీరంతా మంగళవారం ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని చిన్నారుల తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

బాల్యమిత్రుడికి సాయం

నరసన్నపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాల్య స్నేహితుడు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని సహచరులు రూ.50 ఆర్థిక సాయం అందించారు. జలుమూరు మండలం బసివాడ కు చెందిన పొట్నూరు చంద్రశేఖర్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలు సుకుని స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుకున్న కంబకాయి గ్రామానికి చెందిన మిత్రులు స్పందించి వైద్య ఖర్చుల కోసం నగదు అందించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్వామిబాబు, వెంకట్, రంజిత్ తదితరులు ఉన్నారు.

ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన

టెక్కలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థిక, వాణిజ్య శాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో ఎస్‌బీఐ అధికారులు ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలు వివరించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీకాకుళం ఏజీఎం ఎస్.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్లు వై.సీతారామయ్య, రవికుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా ర్యాలీ

నరసన్నపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్‌లోని పహల్గామ్‌లో సందర్శకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ నరసన్నపేట వర్తక, వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ముష్కరులను తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో జామి వెంకటరావు, కేశవరాజు, పెద్దబాబు శ్రీను, పూర్ణ నాగరాజు, ప్రజలు పాల్గొన్నారు.